## నూతన ఆలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం

పులివెందుల, ఫిబ్రవరి 3, ప్రభాత వార్త :



పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని రాజారెడ్డి కాలనీలో నూతన దేవాలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తామని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తుగుట్ల మధు సూదన్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని దేవదానంగా మంజూరు చేయాలని కోరుతూ కాలనీవాసులతో కలిసి మంగళవారం తహసిల్దార్ కి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కు రాజారెడ్డి కాలనీలో భక్తుల ఆధ్యాత్మిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని నూతన దేవాలయం ఏర్పాటు చేయడం అవసరమని, అందుకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కాలనీ వాసులు కోరారు. అనంతరం విలేకరులతో తూగుట్ల మధు సూదన్ రెడ్డి మాట్లాడుతూ దేవాలయాలు కేవలం ఆరాధన స్థలాలే కాకుండా గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు. ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, ప్రజల్లో శాంతి, భక్తి భావనలు పెంపొందుతాయి. ఈ ప్రాంతం ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది అని అన్నారు. నూతన ఆలయ నిర్మాణం పూర్తయ్యే వరకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆలయ నిర్మాణానికి చొరవ చూపుతున్న ఆలయ కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, లోక్‌నాథ్ రెడ్డి, త్రిలోకనాథ్ రెడ్డి, కుమారు, రంగస్వామి, శివ సూరి తదితరులు పాల్గొన్నారు.

## 4లేబర్ కోడ్ లను రద్దు చేయాలి



రాజంపేట, ఫిబ్రవరి4 ప్రభాతవార్త

కేంద్రంలో బీజే ప్రభుత్వం, కార్మికుల పోరాడి సాధించుకున్న, 29!! కార్మిక చట్టాలను, రద్దుచేసి, కార్పొరేట్లకు, పెట్టుబడుదల కనుకూలంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడులను, తక్షణం ఉపసరించుకోవాలని సిఐటియుడిమాండ్ చేసింది. పాత చట్టాలను పగడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని మంగళవారం రాజంపేటలో ఎన్జీవో హోం లో సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె కరపత్రాలను సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సిహెచ్ చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేల్ రవికుమార్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలోనే కార్మికులు ఐక్యంగా పోరాటాలు చేసి కార్మిక హక్కులు పోరాడి సాధించుకున్నారు. ఫిబ్రవరి 12న జరిగే దేశ వ్యాప్త సమ్మె ఎన్నో త్యాగాలు చేసి ప్రాణాలు బలి కొన్ని సాధించిన కార్మిక చట్టాలను రద్దు చేసే ఓ కేంద్ర ప్రభుత్వమా నిన్ను కార్మికులు బొంద పెట్ట సమయం వచ్చింది అని కేంద్ర బీజేపీ ప్రభుత్వంని హెచ్చరించారు. 100మంది పైన ఉన్న కార్మికులే యూనియన్ పెట్టుకోవాలి అంటే ఎవరి ప్రయోజనం కోసం ఈ లేబర్ కోడ్‌లు అని ప్రశ్నించారు. పోరాడి సాధించుకున్న, మే డే,8 గంటల పని హక్కును,12 గంటలకు పెంచడం,ఎవరికి ప్రయోజనం అని ప్రశ్నించారు. యాజమాన్యల కోసమేగా అని తెలిపారు. అందుకే ఫిబ్రవరి 12న జరిగే దేశ వ్యాప్త సర్వత్రిక సమ్మెను కార్మికులు జయప్రదం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మె దేశ భక్తి సమ్మె అని కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు ప్రజలు, అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, సిఐటియు మండల కన్వీనర్, పివి రమణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ఎంవి. రమణ, కె.ప్రసాదు, జి వెంకటరమణ, మధు, రమేషు, అంగనవాడి యూనియన్ నాయకురాలు ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు, ఈశ్వరమ్మ, విజయమ్మ, శివరంజని, అమరావతి పాల్గొన్నారు.

## స్కూటర్ బోల్తా : ఇద్దరికి గాయాలు

చౌడేపల్లి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



స్కూటర్ బోల్తా పడి ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలపాలైన సంఘటన మంగళవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని ఆమినిగుంట పంచాయతీ బూరగపల్లికి చెందిన దేవరాజు(49), నవీన్(25)లు మామిడి తోటకు మందులు పిచకారి చేసే పనికి వెళ్ళి పుంగనూరు మార్గంలోని చౌడేపల్లి వైపు టూవీలర్‌పై వస్తున్నారు. మార్గ మధ్యలోని చిన్నయల్ల కుంట్ల చిగరమాను వద్ద టూవీలర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ వీరిని చుట్టుపక్కల వారు 108 సేవల ద్వారా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ సొబగులు

-స్థలపరిశీలనలో అధికారులు

చౌడేపల్లి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ వెలుగులు రానున్నాయి. ఈ మేరకు రెవిన్యూ, ట్రాన్స్‌కో అధికారులు సంయుక్తంగా స్థలాన్ని పరిశీలించారు. మండలంలోని పెద్దకొండమర్రికి సమీపంలోని మనుకూరమ్మ గుట్టలో 17ఎకరాలు, గడ్డంవారిపల్లి గ్రామం వద్దగల గుట్టలో 13ఎకరాల స్థలాన్ని పరిశీలించినట్లు తహశీల్దార్ భూపతిపార్వతి తెలిపారు. ప్రధానమంత్రి కుసుమ్ ద్వారా ప్రతి మండలంలోనూ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు పుంగనూరు ట్రాన్స్‌కో ఇఇ శ్రీనివాసమూర్తి అన్నారు. ఎఇఇ శవిధర్, రెవిన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో విశేష పూజలు

సదుం ఫిబ్రవరి 3 ప్రభాత వార్త

మండల పరిధిలోని గార్గేయ నది ఒడ్డున వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి పాలు, పెరుగు ,తేనె, చందనం పసుపు, కొబ్బరి నీళ్లతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు ఈ పూజల్లో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వార్లను దర్శించుకున్నారు.భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగించారు.

## ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీలను తహసిల్దార్‌కు అందజేత

పోరుమామిళ్ల రూరల్, జనవరి 3 ప్రభాతవార్త:

పోరుమామిళ్ల మండలంలో ఇటీవల బద్వేల్ నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ రితేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా దర్బార్ లో వచ్చిన ఫిర్యాదులను రితేష్ రెడ్డి పి ఏ బిజీ వేముల రాజశేఖర్ రెడ్డి రంగసముద్రం పంచాయతీ ఎంపిటిసి కల్వకూరి రమణ మంగళవారం ఆయన లేఖతో కలిపి వచ్చిన అర్జీలను తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి అందజేశారు. వచ్చిన యుబి ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేసి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఆయన తెలిపారు.



## ఒకే రాత్రిలో 20బోర్ల కేబుల్ వైర్లు చోరీ

-లబోదిబోమంటున్న రైతులు

చౌడేపల్లి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

మండలంలోని దిగువపల్లి పంచాయతీలో ఒకే రాత్రి 20బోర్లకు చెందిన కేబుల్ వైర్లు చోరీ జరిగింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. మేకలవారిపల్లిలోని 20మంది రైతులకు గ్రామాని చుట్టుపక్కల వ్యవసాయ బోర్లున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు బోర్ల నుంచి దాదాపు రూ. లక్ష విలువ చేయు 500మీటర్ల కేబుల్ వైర్లను దొంగలించుకొని వెళ్ళారని రైతులు వాపోయారు. వ్యవసాయం జూదంలా మారిని ప్రస్తుత సమయంలో కేబుల్ వైర్ల చోరీ మరింత కృంగదీస్తోందని వారన్నారు.

## రేపటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

పీలేరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి మూడు రోజుల పాటు తపాలా శాఖ ఆధ్వర్యంలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు పీలేరు పోస్టల్ ఇన్స్పెక్టర్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆధార్ కొత్త నమోదు. సవరణ చేసుకోవడానికి ప్రత్యేక శిబిరాలు వోహడపడుతాయని తెలిపారు. కొత్త ఆధార్ నమోదుకు. చిరునామా, మొబైల్ నెంబర్, జన్మదిన సవరణలు. బయోమెట్రిక్ అప్డేట్కు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అంబటి రాంబాబు కుమార్తె మాట్లాడిన మాటలను ఖండించిన కలప రవి

పీలేరు ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:



అంబటి రాంబాబు కుమార్తె మాట్లాడిన మాటలను ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి మరియు పీలేరు మార్కెట్ డైరెక్టర్ మరియు రాష్ట్ర కాపు సంక్షేమ రైతు విభాగ కార్యదర్శి కలప రవి తప్పు పట్టారు. మొన్న మీడియా సమావేశంలో ఆమె మేము కాపులము కాపులపైన టిడిపి నాయకులు దాడి చేయడానికి కారణము పవన్ కళ్యాణ్‌ని చూసే వారు దాడి చేసినట్టు ఆమె చెప్పకు వచ్చింది అమ్మ తల్లి ఈరోజు నీకు పవన్ కళ్యాణ్ గుర్తొచ్చాడా .. కాపులు గుర్తొచ్చారా.. మీ నాన్న కాపులు గురించి మాట్లాడినప్పుడు తప్పు పట్టినప్పుడు నువ్వు నోరు మెదపలేదే ఈరోజు మీకు మీ నాన్న మాట్లాడిన మాటలు వల్ల మీకు కష్టమొచ్చేకుందుకే పవన్ కళ్యాణ్ గుర్తొచ్చాడా పవన్ కళ్యాణ్‌ను దుర్భాషలాడినప్పుడు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి గాని మరియు కొడాలి నాని పేర్ని నాని మీ నాన్న కూడా సైతం పవన్ కళ్యాణ్ మాట్లాడినప్పుడు అప్పుడు ఆ కాపులు గుర్తు రాలేదా నీకు ఇది కాపులకు సంబంధించి విషయం కాదు. ఇది ఎక్కడ న్యాయము కాపులు ఎప్పుడు నిజాయితీగానే ఉంటారు న్యాయం పక్కనే నిలబడతారు న్యాయం కోసమే పోరాడుతారు కాబట్టి నువ్వు స్వచ్ఛమైన కాపు కాదు కాబట్టి ఈ విధంగా మాట్లాడుతున్నాం ఆ రోజే పవన్ కళ్యాణ్ ని వాళ్ళ తల్లిని మరి చిరంజీవిని అంత ఘోరంగా వైసిపి వాళ్ళు అవమానించేటప్పుడు నువ్వెక్కడ పోయావమ్మా ఈరోజు మాత్రము కులాన్ని కంట కడుతున్నావు ఇలాంటి మాటలు నువ్వు కాపులు పైన చేయడం సరి అయిన పద్ధతి కాదని మేము కూడా ఒక కాపు బిడ్డగా మీ వ్యాఖ్యలను ఖండిస్తున్నాను.

## యూరియా పంపిణీ చేయాలి..

బ్రహ్మంగారిమఠం ఫిబ్రవరి 03 ప్రభాతవార్త



మండలంలోని రైతులకు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గండి సునీల్ కుమార్ మాట్లాడుతూ మండలంలో సచివాలయాలకు వచ్చేటువంటి అరకొర యూరియా ఐదు ఎకరాలు ఉన్న రైతులకు కూడా ఒక బస్తాతోనే సరిపెట్టడం అనేది సరైనది కాదని, రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇలా అరాకుర యూరియా సరఫరా చేయడం దారుణం అని వారన్నారు. ప్రైవేట్ షాపులలో ఒక యూరియా బస్తా నాలుగు వందల నుండి ఐదు వందల రూపాయలు అమ్మకాలు చేస్తున్న అధికారులు స్పందించకపోవడం సిగ్గుచేటని వారన్నారు. అలాగే సచివాలయాలకు వచ్చిన యూరియా రాజకీయ ప్రలోభంతో కావలసిన వారికి కావాల్సినంతగా పక్కదారి పడుతుందన్నారు. జిల్లాస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి మండలంలో యూరియా కొరత లేకుండా చూడాలని రైతన్నలు ఆదుకోవాలని. లేనిపక్షంలో మండలంలో రైతులతో కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల మండల కమిటీ సభ్యులు గండి గురయ్య, నరసింహ, అజయ్‌లు పాల్గొన్నారు.

## అనాధ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ లో లక్ష్మీదేవి అనే మహిళ హెచ్ఐవి చేత మరణించగ అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు రాకపోవడంతో హాస్పిటల్ సిబ్బంది ఫోన్ ద్వారా మేఘహెల్ప్యూ ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్ ని సంప్రదించగా వారు వెంటనే స్పందించి మంగళవారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు,టౌన్ ప్రెసిడెంట్ అహమ్మద్ హుస్సేన్,సుబహాన్ వైస్ ప్రెసిడెంట్ మునీంద్ర, ఈశ్వర్ రెడ్డి కృప అగ్ని షారూన్ ట్రస్ట్ సభ్యులు సుమన్ బాబు, సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

### మఠాధిపతులకు వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



బ్రహ్మం గారి మఠం ఫిబ్రవరి 03 ప్రభాతవార్త

జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి గురుదేవులు శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వాములవారి తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠం మఠాధిపతి శ్రీ వీర భోగ వసంత వెంకటాద్రి స్వాముల వారికి మరియు శ్రీ జగన్మాత ఈశ్వరిదేవిమఠం మఠాధిపతి శ్రీ శివకుమార్ స్వామి వారిని ఆహ్వానించిన శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి వారి బ్రహ్మోత్స వాల ఆహ్వాన పత్రికను దేవస్థానం ఆలయ అర్చకులు మఠాధిపతులకు అందించి ఆహ్వానించారు.శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి వారి తృతీయ వార్షికోత్సవాలు ఫిబ్రవరి 8 తేదీ నుంచి 17 తేదీ మంగళవారం వరకు అత్యంత వైభవముగా జరుగునని బ్రహ్మోత్సవాలలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరన్నారు.

## సిటిఎం నలవీర గంగాభవానిని దర్శించుకున్న ఎమ్మెల్యే

మదనపల్లి ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

ఉమ్మడి చిత్తూరు జిల్లా పడమటి మండలాలలో అత్యంత వైభవంగా నిర్వహించే తొలి జాతర సి టిఎం నలవీర గంగాభవాని అమ్మవారిని మంగళవారం ఎమ్మెల్యే షాజహాన్ భాష దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే రాకతో ఘన స్వాగతం పలికారు.. స్థానిక తెలుగుదేశం నేతలతో కలిసి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం.. ఆలయ కమిటీ సభ్యులు ఆనంద్ పార్థసారథి, సురేందర్ రెడ్డి, నారాయణ, వెలుగు చంద్ర, వీర ప్రతాప్ లవ్ ఎమ్మెల్యే ను శాలువతో సత్కరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి రెడ్డి స్వామి, ఏఎంసి డైరెక్టర్ నరసింహులు, వేమన్న, కౌన్సిలర్ తులసి రామకృష్ణ, జెసిబి వేణు, జయరాం యాదవ్ పాల్గొన్నారు.



## వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షునిగా ఎర్రం రెడ్డి రెడ్డప్ప రెడ్డి

ములకలచెరువు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:

మండలంలోని పాత ములకలచెరువు లో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ఆదేశాల మేరకు మండల పరిశీలకులుగా విచ్చేసిన బి కొత్తకోట మాజీ ఎంపీపీ ఖలీల్ భాషా ఆధ్వర్యంలో వైసిపి గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో అధ్యక్షునిగా ఎర్రం రెడ్డి రెడ్డప్పరెడ్డిని గ్రామంలోని వైసిపి నాయకులు కార్యకర్తలు, మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ తనమీద ఎంతో నమ్మకంతో తనకు ఈ పదవి నిచ్చిన ఎమ్మెల్యేకు, అభినందనలు. తన వంతు గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కోటిరెడ్డి మాధవరెడ్డి, జడ్పిటిసి మోహన్ రెడ్డి, ఎంపీపీ సాయి లీల ఉమా మహేష్, మండల ప్రత్యేక ఆహ్వానితులు సిద్ధారెడ్డి, ఎంపీటీసీలు, ఆయేషా చాంద్బాషా, రఫీ, మాజీ ఉపసర్పంచ్ ఆన్సర్ భాష, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రిసర్వే, పూర్తిచేసి ఫ్రీహోల్డ్ తొలగించాలి.

మైదుకూరు, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త:

కడప జిల్లాలో భూముల రిసర్వే పేరుతో సమస్యలు లేని రైతుల భూములను కూడా ఫ్రీ హోల్డ్ కింద నమోదు కావడంతో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతు సేవా సమితి కడప జిల్లా అధ్యక్షుడు ఏవి. రమణ అన్నారు.పట్టణంలో రైతులు,రైతు సేవా సమితి నాయకుల తో కలసి రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూములపై ఫ్రీ హోల్డ్ పేరుతో రెండు నెలలకు ఒకసారి భూముల రిసర్వే పూర్తి చేయకుండా ఫ్రీ హోల్డ్ తొలగించకుండ వాయిదావేస్తూ గత సంవత్సరం రోజులుగా వాయిదాల మీద వాయిదాలు వేసుకుంటూ రావడంతో రైతులకు కంప్యూటర్లో వన్ బి, అడంగల్ రాకపోవడంతో సమస్యలు లేని భూముల రైతులు కూడా బ్యాంకులలో క్రాప్ లోన్లు రెన్యువల్ చేసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వం వెంటనే రిసర్వే ను పూర్తి చేసి ఫ్రీ హోల్డ్ ను ఎత్తివేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా సమితి మైదుకూరు పట్టణ అధ్యక్షులు కానగూడూరు రామ్మోహన్, చెక్ పోస్ట్ శ్రీనివాసులు, రైతులు, సుబ్బరాయుడు, పోతురాజు లక్ష్మయ్య, హుస్సేన్,చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలు ఆకస్మిక తనిఖీ

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:



మండల పరిధిలోని వ్యవసాయ ఇన్‌పుట్ డీలర్లు మరియు రైతు సేవా కేంద్రాల యొక్క ఎరువుల పంపిణీ క్షేత్ర స్థాయిలో ఎలలా జరుగుతోందని జిల్లా వ్యవసాయాధికారి బి.చంద్రానాయక్ ఆకస్మికతంగా తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధర రూ.267.5 మాత్రమే విక్రయించాలని తమ వద్ద ఉన్న స్టాక్ వివరాలు రైతులకు కనబడేలా స్టాక్ బోర్డు నందు చూపించాలన్నారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ జిల్లాలో సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని దఫల వారీగా అందజేస్తామని కావునా రైతులు ఎవరూ కంగారు పడాల్సిన అవసరం లేదని అందరికీ సరిపడా యూరియా నిల్వలు జిల్లాలో ఉన్నాయన్నారు. వెల్లటూరులోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న డీబీటీ త్వరితగతిన పూర్తి చేయాలని తద్వారా సంబంధిత డీలర్లకు స్టాక్స్ వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిఎపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.అరవింద నాయక్, ఏఈవో గంగాధర్, రైతులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## పాస్ బుక్కులు పంపిణీ

దువ్వూరు, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త:



మండలంలోని కానగూదూరు గ్రామంలో మంగళవారం రాజముద్రతో కలిగిన పట్టాదారు పాస్ పుస్తకాలను తహసీల్దార్ సంజీవరెడ్డి రైతులకు పంపిణీ చేశారు. 2వ విడత భూ సర్వేలో భాగంగా సర్వే పూర్తి అయిన గ్రామాలలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా కానగూడూరులో ఎటువంటి తప్పులు లేని అన్ని కొలతలతో సమానమైన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేస్తున్నామన్నారు. ఇంకా ఏవైనా పొరపాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని సరి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కరీముల్లా, వీఆర్ఏ శోభ తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నాప్ చేసినవారిని తక్షణమే అరెస్టు చేయాలి

పీలేరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:



విద్యార్థి నాయకులపై అమానుష దాడులు చేసి కిడ్నాప్ చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్‌తేజ తీవ్రంగా ఖండించారు. యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరుపతి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించేందుకు వెళ్తున్న ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా కార్యదర్శి అక్బర్, ఎస్ఎఫ్ఐ ఎస్వీ యూనివర్సిటీ నాయకుడు వినోద్‌లను దారిలో అడ్డగించి, సుమారు 30 వాహనాల్లో వచ్చిన అనుచరులు అమానుషంగా దాడి చేసి కిడ్నాప్ చేశారని అమృత్‌తేజ తెలిపారు. ఈ ఘటనను తిరుపతి జిల్లా పోలీస్ యంత్రాంగం అత్యంత సీరియస్‌గా తీసుకుందన్నారు. జిల్లా యస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు అడిషనల్ యస్పీ రవి మనోహర చారి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, ఘటన జరిగిన గంట వ్యవధిలోనే కిడ్నాప్‌కు గురైన విద్యార్థి సంఘం నాయకులు అక్బర్, వినోద్‌లను పోలీసులు సురక్షితంగా రక్షించారని తెలిపారు. ఈ నేరానికి ప్రోత్సహించిన వారిపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేయడం అభినందనీయమన్నారు.

## అరెస్ట్ చేయాలి

పీలేరు , ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:

విద్యార్థి నాయకులను కిడ్నాప్ చేపించిన అరెస్ట్ చేయాలని వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర చక్రధర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ యూనివర్సిటీలో అక్రమాలను నిరసిస్తూ తిరుపతి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించడానికి వెలుతున్న ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా కార్యదర్శి ఆక్బర్. ఎస్వీ యూనివర్సిటీ నాయకుడు వినోద్లను దారిలో అడ్డగించి అమానుషంగా వాడి చేసి కిడ్నాప్ చేయడం బాధాకరమన్నారు. విద్యార్థి నాయకులపై గుండాలు దౌర్జన్యం. కి డ్నాప్ చేయడం అటవిక చర్య అని పేర్కొన్నారు. యూనివర్సిటీలో గతంలో కూడా అనేక అక్రమాలు వెలుగు చూశాయని తెలిపారు. తక్షణం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## నలుగురు జూదరులు అరెస్ట్

దువ్వూరు, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో మంగళవారం జూదం ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు ముందుగా రాబడిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బందించే కలిసి దాడులు చేశామని, ఈ దాడుల్లో నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 6100 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని త్వరలో కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు.

## మహానందిపల్లెలో పొలము పిలుస్తుంది

కలసపాడు, జనవరి 3 ప్రభాతవార్త:



మండలంలోని మహానందిపల్లె గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని రైతులతో కలసి పంట సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి విజయ్ కుమార్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ సాగు చేసిన పలు రకాల పంటలకు యూరియా అధిక మోతాదులో వాడటం వలన అనర్థం కలుగుతుందని ఆయన సూచించారు. పంటలో కలుపు మొక్కలు లేకుండా అంతరకృషి చేసుకోవాలన్నారు.పై పాటుగా భాస్వరం ఎరువులను వాడరాదన్నారు. రైతులు ఎప్పటికప్పుడు ఆధునిక పద్ధతులను అనుసరించి పంటలు సాగు చేసుకుంటే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చు అని ఆయన అన్నారు. అలాగే ఎరువులతో పాటు సూక్ష్మపోషకాలను కూడా బాగా వాడుకోవాలన్నారు.

## గ్రామీణ పీఎస్ పరిధిలో రేషన్ బియ్యం పట్టివేత

ప్రొద్దుటూరు క్రైం, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు గ్రామీణ పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. దాదాపు 15 నుంచి 20 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు. బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కల్తీ మద్యం కేసులో ఎనిమిది మందికి బెయిల్.

తంబళ్లపల్లె ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మొలకలచెరువు కల్తీ మద్యం కేసులో మరో ఎనిమిది మందికి తంబళ్లపల్లె కోర్ట్ బెయిల్ మంజూరు చేసింది. కల్తీ మద్యం కేసులో ఏ1 ముద్దాయిగా ఉన్న అద్దేపల్లి జనార్దన్ రావు తోపాటు మరో ఏడుగురికి బెయిల్ మంజూరు అయింది. ములకలచెరువు కల్తీ మద్యం కేసులో మొత్తం 33 మంది నిందితులుగా ఉండగా ఇప్పటికీ 22 మంది కి బెయిల్ మంజూరు కాగా ప్రస్తుతం 9 మంది రిమాండ్ లో ఉన్నారు. కల్తీ మద్యం కేసులో తంబళ్లపల్లె తెలుగుదేశం పార్టీ నుండి సస్పెండ్ అయిన మాజీ ఇంచార్జ్ఏ17 జయ చంద్రారెడ్డి, ఏ18 గిరిధర్ రెడ్డి ల ఆచూకీ ఇంతవరకు కాన రాలేదు.

## అదనపు కట్నం వేధింపుల పై కేసు నమోదు

ముద్దనూరు,ఫిబ్రవరి 03,ప్రభాతవార్త:

మండల పరిధిలోని రాజుల గురువాయుపల్లె గ్రామానికి చెందిన ఓ వివాహిత మహిళ ను , భర్త అత్త,మామలు అదనపు వరకట్నం తీసుకురావాలని మానసికంగా, వేధిస్తున్నారని మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నంద్యాల జిల్లా, సంజామల మండలం, అంకమల్లే గ్రామానికి చెందిన రామ తులసి రెడ్డితో వివాహమైంది. వివాహం అయినప్పటి నుంచి అదనపు వరకట్నం తీసుకురావాలని వేధిస్తున్నడంతో మహిళ తగిన న్యాయం చేకూర్చాలని పోలీసులను ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. బాధిత మహిళా ఫిర్యాదు మేరకు సీఐ నాగేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సమస్యల పరిష్కారం కోరుతూ మంత్రికి వినతి

మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త.

ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలంటే ఉద్యోగులు మంత్రి రాంప్రసాద్ రెడ్డికి విన్నవించారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ ఆదేశానుసారం జిల్లా ఉద్యోగులు డాక్టర్ లక్ష్మీప్రసాద్, గురు ప్రసాద్, గంగయ్య గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి రాంప్రసాద్రెడ్డి ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ఉద్యోగులకు దీనికి కాలంగా పెండింగ్లో ఉన్న ఆర్థిక ప్రయోజనాలను వెంటనే పరిష్కరించాలని కోరారు. వేతన సవరణ కమిటీలు తక్షణం నియమించి నివేదిక వచ్చే వరకు 30 మధ్యంతర భృతిని ప్రకటించాలని, నాలుగు విడుదల డిఎ, సరెండర్ లీవ్ తదితర ప్రయోజనాలను తక్షణం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమాశంకర్ , శివకుమార్ , ధర్మయ్య, కిరణ్ కుమార్, టి బాబు, బాలాజీ, సాయి, సుజిత్, హరీష్, యాదవ్ ,నాగేంద్రప్రసాద్, గోవర్ధన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి సదస్సు జయప్రదం చేయండి

వేంపల్లి:ఫిబ్రవరి 03(ప్రభాత వార్త)

స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు బ్రహ్మం, వెంకట్ రామ్ మరియు పాలిటెక్నికల్ విద్యార్థులతో కలిసి కరపత్రం విడుదల చేసిన అనంతరం వారు మాట్లాడుతూ ప్రపంచం నేడు శాస్త్ర సాంకేతిక రంగంలో వేగంగా ముందుకు దూసుకుపోతున్నది. ఈ అవసరాన్ని దృష్టిలో పెట్టుకునే ఐటిఐ, పాలిటెక్నికల్, వంటి నైపుణ్య విద్యా కోర్సులు ప్రవేశపెట్టబడ్డాయి. ఈ కోర్సుల ప్రాముఖ్యత అత్యంత కీలకమైనది. కానీ ప్రభుత్వాలు ఈ విద్యాసంస్థల పట్ల చిన్నచూపు చూపుతున్నాయి. జిల్లాలో ఉన్న ఐటిఐ, పాలిటెక్నికల్, కళాశాలలకు అవసరమైన, భవనాలు,మౌలిక వసతులు, తరగతి గదులు, ప్రయోగశాలలు, యంత్ర పరికరాలు అన్ని కోర్సులు, సబ్జెక్టులకు తగిన అధ్యాపకులులేకపోవడంతో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంకా దుర్మార్గం ఏంటంటే జిల్లాలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులలో ఎక్కువ శాతం రాష్ట్రేతరులు కావడం. స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా మారి, వారి బతుకు దినదిన గండంగా మారుతోంది. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బత్తల అరుణ్, నాయకులు భరత్, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ పదవుల్లో యువతకు ప్రాధాన్యత కల్పించాలి

వేంపల్లె:ఫిబ్రవరి 03(ప్రభాత వార్త)

టిడిపి పార్టీకి చెందిన పదవుల్లో యువతకు కూడ ప్రాధాన్యత కల్పించి పదవులు కట్ట బెట్టాలని తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు గంగధర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డిలు కోరారు. మంగళవారం జమ్మలమడుగులోని టిడిపి పార్టీ కార్యాలయంలో ఉన్న టిడిపి జిల్లా అధ్యక్షుడు భూపేష్ సుబ్బారామి రెడ్డిని వేంపల్లెకు చెందిన తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు గంగధర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, అహమ్మద్ అలీ (సెట్) లు మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే జిల్లా అధ్యక్షుడు భూపేష్ సుబ్బారామి రెడ్డిని శాలువతో ఘనంగా సత్కరించారు. పార్టీలో ఉత్సాహం పెంచేందుకు యువతకు కూడ అవకాశాలు ఇవ్వాలని కోరారు. ఎన్నికల్లో టిడిపి పార్టీ అధికారంలోకి వచ్చేందుకు యువత పార్టీ కోసం కృషి చేశారని తెలిపారు. ఉన్న అవకాశాలను యువతకు కూడ కల్పించి భాగస్వాములు చేయాలని కోరడం జరిగింది. పార్లమెంటరీ పదవుల్లో యువతకు ప్రాధాన్యత కల్పించి పార్టీ పదవులు ఇవ్వడం జరుగుతుందని భూపేష్ రెడ్డి హామీ ఇచ్చారు. జిల్లా పదవులు పొందిన వారి ప్రమాణ స్వీకారం పూర్తి అయిన తర్వాత మిగిలిన పార్టీ పదవులను ఎక్కువ శాతం యువతకే కల్పిస్తామని చెప్పినట్లు తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడు గంగధర్ రెడ్డి తెలిపారు. భూపేష్ రెడ్డిని కలిసిన వారిలో టిడిపి నేతలు పాల్గొన్నారు.




## భూముల కౌలు ద్వారా రూ 13,314 ఆదాయం.

తంబళ్లపల్లె ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :

తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లి లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ మాన్యం భూములను ఏడాదికి కౌలుకు వేలం పాటల ద్వారా రూ 13,314 ఉదయం లభించినట్లు టీటీడీ ఏఈఓ గోపీనాథ్ తెలిపారు. మంగళవారం వెంకటేశ్వర ఆలయంలో జరిగిన టెండర్ రహిత వేలం పాటలలో స్వామివారి మాన్యం 9.49 1/2 ఎకరాల భూమిని వ్యవసాయ సాగు వేలం పాటల నిర్వహించారు. ఈ వేలం పాటల ద్వారా రూ 13 314 ఆదాయం సమకూరింది. ఈ వేలం పాటల కార్యక్రమంలో తాసిల్దార్ లలితాంజలి, టిటిడి సిబ్బంది నగేష్, నాగరాజు, విజిలెన్స్ సిబ్బంది, వేలంపాటదారులు, ప్రజలు పాల్గొన్నారు.

మార్క్‌లిస్టు పోయినది

అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం గాలివీడు గ్రామం మజరా కస్బా నివాసి షేక్ ముక్సుర D/o భాష అయిన నేను మా ఇంటిని శుభ్రం చేసేటప్పుడు నా 10వ తరగతి మార్కుల జాబితా పోయినది. (హాల్‌టికెట్ నంబర్ 1722136591, సం.2017) ఈ సర్టిఫికెట్ ఎవరికైనా దొరికినచో పై అడ్రస్‌కు, ఈ క్రింద సెల్ నెంబర్‌కు తెలుపగలరని కోరుతున్నాను.

ఫోన్ నెంబర్.7013164427.

## పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

**రామసముద్రం ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**



ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఇంటి పన్నుల వసూళ్లలో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. గ్రామపంచాయతీ లలో పన్నులు వేగవంతంగా 100శాతం వసూళ్ల చేయాలని సిబ్బందికి తెలియజేసారు. పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని, పంచాయతీకి పన్నులు చెల్లిస్తే అభివృద్ధి చెందుతాయన్నారు. గ్రామాల్లో ఎక్కడైన డామేజ్ అయిన పైపులైన్లను ఉంటే పంచాయతీలలోని సచివాలయాలకు వెళ్లి సిబ్బందికి తెలియపరచండి వెంటనే వచ్చి మరమ్మత్తులు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ ఉత్పత్తి, సరఫరాలపై అవగాహన సదస్సు

**కురబలకోట ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**



మండలం అంగళ్లకు సమీపంలోని మిట్స్ డీమ్డ్‌టుబీ యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం వారు విద్యార్థులకు విద్యుత్ ఉత్పత్తి మరియు సరఫరా అంశాలపై మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలికిరి సబ్ స్టేషన్ ఏపీ ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వి. మహేష్ బాబు పాల్గొని విద్యుత్ ఉత్పత్తి నుంచి గ్రిడ్ వరకు జరిగే ప్రక్రియలు, ఏపీ జెన్‌కో, ఏపీ డిస్కమ్, ఏపీ ట్రాన్స్‌కో శాఖల విధులు, 11 కే.వి., 33 కే.వి., 130, 220, 400 కే.వి. టవర్ల గుర్తింపు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సబ్‌స్టేషన్లు, హై టెన్షన్ టవర్లు, వోల్టేజ్ స్థాయిలపై అవగాహన పెంచుకోవడం ద్వారా పరిశ్రమల్లో ఉపయోగించే నిజమైన సాంకేతికతను అర్థం చేసుకోగలుగుతారన్నారు. అల్ట్రా హై వోల్టేజ్ సబ్‌స్టేషన్లు ఎక్కువ దూరాలకు భారీగా విద్యుత్‌ను సమర్థవంతంగా ప్రసారం చేయడంలో ముఖ్యమని, పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో 765 కే.వి. ఏసీ లేదా 800 కే.వి. హెచ్‌వీడీసీ అల్ట్రా హెవీ టెన్షన్ సాంకేతికత అవసరమైందని, అధిక వోల్టేజ్ వల్ల నష్టాలు తగ్గి సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. అలాగే ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్ వంటి విద్యుత్ శాఖల పనితీరు తెలుసుకోవడం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ దీపాంకర్ రాయ్, ఈ.ఈ.ఈ. విభాగాధిపతి డాక్టర్ ఎ.వి. పవన్ కుమార్, కోఆర్డినేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.ఎస్. బాలాజీ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మట్టి నమూనాల సేకరణ పై శిక్షణ

**కురబలకోట ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**



మట్టి నమూనాల సేకరించే ప్రక్రియపై మంగళవారం ఏపీ సీఎం ఎఫ్ మరియు రైతు సేవ కేంద్రాలు అగ్రికల్చరల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వినీత, ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్లో రైతుల ఒకే రకమైన పంటలను సాగు చేయడం వల్ల నేలలు పోషకాలు తగ్గిపోతాయి. అంతేకాకుండా నేలలు నిస్సారవంతమై తగిన దిగుబడును రాకపోగా చీడపీడలు ఎక్కువై ఆర్థికంగా రైతులు నష్టపోతారు. అటువంటి భూముల్లో మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లి పరీక్షించి వాటి దుష్పరిమాణాలు, ఫలితాలను గురించి రైతులకు తెలియజేయాలి. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు ముగ్గు చూపేలా కృషి చేయాలన్నారు. ఈ నమూనాల సేకరణపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏపీ సి ఎస్ ఎఫ్ స్టాఫ్ ఐ సి ఆర్ సిలు నారాయణ ,రమేష్ రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా గ్రామ కమిటీ అధ్యక్షుడుగా మల్‌రెడ్డి.

**తంబళ్లపల్లె ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ః**



మండలం గోపి దిన్నె పంచాయితీ వైకాపా గ్రామ కమిటీ అధ్యక్షుడుగా మల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల పార్టీ అధ్యక్షుడు రేపన చౌడేశ్వర తెలిపారు. మంగళవారం ఎన్నికల అబ్జర్వర్ ఉమాపతి రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా మల్రెడ్డిని నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన ఎన్నికపై ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలకు మల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్యామలా కోటిరెడ్డి, సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, శివారెడ్డి, రఘురాం రెడ్డి, శివరాంరెడ్డి, రామస్వామి రెడ్డి, వీరాంజనేయరెడ్డి, పెద్దిరెడ్డి, రమేష్ రెడ్డి,అశోక్ రెడ్డి, శ్రీనివాసులు, మల్లికార్జున, విజయ్ కుమార్, ఆనంద్, ప్రభాకర్ రెడ్డి, శివారెడ్డి, భాస్కర్ రెడ్డి, చిన్నపరెడ్డి, ఆనంద్ రెడ్డి, శేఖర్ రెడ్డి, దొరస్వామి నాయక్, కృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైవీయూకు ఐఎసవో సర్టిఫికేట్లు పునరుద్ధరన

**వైవీయూ, ఫిబ్రవరి 03 ప్రభాతవార్త:**



యోగి వేమన విశ్వవిద్యాలయం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పని చేయడం. అభినంద నీయమని ఎమ్.హెచ్.వై.ఎం ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శివయ్య అన్నారు.. గత సంవత్సరం పొందిన ఐఎస్వో సర్టిఫికెట్లును పరిశీలించారు. తాజాగా విశ్వవిద్యాలయంలోని ఏకడమిక్ అడ్మినిస్ట్రేషన్, గ్రీన్ఎనర్జీ, రిసోర్స్ ప్రమాణాలను, వివిధ విభాగాలు పరిశీలించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయంటూ ఐఎస్ఓ : 21001:2018 (క్వాలిటీ ఎడ్యుకేషన్), ఐ ఎస్ ఓ 14001: 2015 (ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్), ఐఎస్ఓ 50001:2018( ఎనర్జీ మేనేజ్మెంట్) సర్టిఫికెట్లను పునరుద్ధరించి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ రిజిస్ట్రార్ ఆచార్య పి పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల డీన్లు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డైరెక్ట్ రేట్ అఫ్ అడ్మిషన్, ఐక్యూఏస్ ప్రతినిధుల బృందం, పి ఆర్ సెల్ డైరెక్టర్ పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## హుండి లెక్కింపునకు పురుషులు మాత్రమే రావాలి

**రాయచోటి ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

రాయచోటి లోని "శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి " దేవస్థానం నందు 04 తేదీన ఉదయం 9 గంటలకు హుండీలోని కానుకలను లెక్కింపు కార్యక్రమం నిర్వహించబడును. కావున హుం డి కానుకల లెక్కింపునకు పురుషులు మాత్రమే పాల్గొన వలయునని, హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు సాంప్రదాయ దుస్తులు ధరించి రావలసినదిగా ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.వి. రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమం

**తొండూరు ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యందు డాక్టర్ సుభాషిణి ఆధ్వర్యంలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ 5 సంవత్సరంలలోపు పిల్లలకు, గర్భవతులకు అనీమియా ముక్తి భారత్ కార్యక్రమంలో రక్తహీనత నివారణ చర్యలు చేపట్టాలని, ఈ నెల 17 వ తేది జరిగే నులిపురుగుల నివారణ నిర్మూలన కార్యక్రమం విజయవంతం చేయాలని తెలిపారు. అలాగే 31.01.26 వ తేది నుండి 13.02 26 వ తేది వరకు జరిగే కొత్త లెప్రసి కేసులు గుర్తించడం కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారిని విజయ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మల్లయ్య, సమాజ ఆరోగ్య అధికారుణీలు సోమేశ్వరీ, ప్రసన్న, శిరీష, ఆరోగ్య కార్యకర్తలు నాగేశ్వరీ, మంజుల, అంజలి, శాహనాజ్, మధుర, కేశమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ

**సిద్ధవటం ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**



పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో రైతులు, ఎటువంటి రుసుము చెల్లించవద్దని డిఆర్ఓ, విశ్వేశ్వర నాయుడు తెలిపారు మండలంలోని, శాఖరాజు పల్లి రెవిన్యూ, మోహిద్దిన్ సాహెబ్ పల్లె గ్రామంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా తీసుకొని, రైతుల భూములు రీసర్వే చేపట్టి అర్హులైన రైతులకు పట్టాదారు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ అర్హులైన రైతుల భూములు రీ సర్వే చేపట్టి న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేపట్టామని రైతులు ఎలాంటి పైకం చెల్లించవద్దని రైతుల అపోహలు తొలగించి పుస్తకాలపై ఎవరి చిత్రం లేకుండా పంపిణీ చేపట్టామని తెలిపారు. ఆర్డీవో జాన్ ఇర్విన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల మీ భూమి, మీ హక్కు పేరుతో రైతుల భూములు సర్వే చేయించి రాజముద్రతో కూడిన పట్టా పాస్ పుస్తకాలు పంపిణీ చేపట్టడం జరుగుతుందని ప్రతి రైతు ఈ కేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు, టిడిపి మండల అధ్యక్షులు రాజశేఖర్ మాట్లాడుతూ పాసు పుస్తకాలు పంపిణీ చేయడంపై రైతుల భూములపై హక్కులు కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ ఆకుల తిరుమల బాబు రాష్ట్ర దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్ వీరభద్రుడు టిడిపి మండల అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ జెడ్పిటిసి సభ్యుడు చలమయ్య, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు చెంచయ్య నాయుడు ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, యాదవ సంఘం జిల్లా కార్యదర్శి, కృష్ణ, మండల సర్వేయర్ సోమశేఖర్ విఆర్వోలు, హరికృష్ణ, ప్రభాకర్ రెడ్డి, గౌస్ పీర్, రెవిన్యూ సిబ్బంది, మండల టిడిపి నేతలు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

**చిన్నమండెం ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:**



మంగళవారం మండలంలోని బోరెడ్డిగారిపల్లిలో మంత్రి స్వగృహం నందు జిల్లా నలుమూలల నుండి వచ్చిన అధికారులు ప్రజలతో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజల సమస్యలు స్వయంగా విని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి,సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా పలువురు కలిసి తమ సమస్యలను వివరించగా, వాటిని పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు.

## రైతులకు యూరియా బస్తాలు పంపిణీ

**తొండూరు ఫిబ్రవరి 03 ప్రభాతవార్త :**



మండలంలోని మల్లేల, బూచుపల్లె,మడూరు గ్రామ రైతులకు మంగళవారం యూరియా బస్తాలను పంపిణీ చేశారు. మండల కేంద్రమైన తొండూరు రైతు భరోసా కేంద్రంలో ఏవో రాజు రైతులకు మొత్తం 43 టన్నుల యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో రాజు మాట్లాడుతూ పోలీసుల సహకారంతో యూరియా పంపిణీలో ఎలాంటి ఘర్షణలు లేకుండా సజావుగా యూరియాను పంపిణీ చేశామన్నారు. ఇంకా ఎవరైనా గ్రామాలలో యూరియా కావలసినవారు రైతు భరోసా కేంద్రాల వద్దకు వచ్చి తీసుకువెళ్లాలని తెలిపారు.కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చేయూత

**బద్వేలు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త**



మున్సిపాలిటీ పరిధిలోని గోపవరం మండలం లక్ష్మీపాలెం ప్రాథమిక పాఠశాల మరియు అంగన్వాడి కేంద్రంలో చదువుతున్న విద్యార్థులకు ఆర్.ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజన ప్లేట్లు, వాటర్ బాటిల్స్, ఇతర విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎస్ ఫౌండేషన్ గౌరవ సలహాదారు మానుగుంట రవిశంకర్ మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పూసలవాడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శేషాద్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తోడ్పాటు అందిస్తున్న ఆర్.ఎస్ ఫౌండేషన్ సేవలను అభినందించారు. విద్యార్థుల్లో ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా, పరిశుభ్రంగా ఉన్నప్పుడే విద్యాభివృద్ధి సాధ్యమవుతుందని, అప్పుడు వారు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. ప్రతి ఆడపిల్లను చదివించాలని, ఆడపిల్లల విద్యతోనే దేశ ప్రగతి సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, రామచంద్రయ్య, అంగన్వాడి టీచర్ అనురాధ, గ్రామ పెద్ద డేనియల్, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మురుగునీటి సమస్యకు పరిష్కారం

**తొండూరు ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**



మండలంలోని మల్లెల గ్రామం నందు మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని ఎన్ఎస్ పి ఆర్ కన్స్ట్రక్షన్ అధినేత అయిన శివప్రకాష్‌రెడ్డితో తొండూరు మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు భూమిరెడ్డి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ హైవే రోడ్డు పనులు జరుగుతున్న కారణంగా ఎస్సీ కాలనీ ఏరియాలో డ్రైనేజీ వాటర్ కెనాల్ కు ఎటువంటి ఇబ్బంది జరగకుండా ఎన్ఎస్‌పిఆర్ కన్స్ట్రక్షన్ వారితో చర్చించి మురుగునీరు కాలువ మంచినీటి పైపులైన్ల సమస్యను పరిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ కాలనీలోని ప్రజలందరూ పాల్గొని తమ సమస్యకు పరిష్కారం చూపినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.

## పి.ఎఫ్ స్లిప్పులను ఆన్లైన్ చేయాలి.

**ఎడ్యుకేషన్ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**

ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ స్లిప్పులను వెంటనే ఆన్లైన్ చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఓబుళమ్మకు యుటిఎఫ్ జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. మంగళవారం సాయంత్రం కడపలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ సీఈవో ఓబుళమ్మని కలిసి యుటిఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ప్రతి నెలా వేతనం నుండి మినహాయించి జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్‌కు కాంట్రిబ్యూషన్‌ను జమ చేయడం జరుగుతున్నదన్నారు. అయితే జిల్లాలో ప్రావిడెంట్ ఫండ్‌ను పూర్తిస్థాయిలో ఆన్లైన్ చేయకపోవడం మూలాన తమ మినహాయింపులు జమ అవుతున్నాయో లేదో తెలుసుకోలేని పరిస్థితి ఉందన్నారు. జిల్లా పరిషత్ అధికారులు స్పందించి తక్షణం 2024 , 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన స్లిప్పు లను ఆన్లైన్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా జెడ్పి సీఈవో ఓబులమ్మ మాట్లాడుతూ ప్రావిడెంట్ ఫండ్ స్లిప్పులను ఆన్లైన్ చేసే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించామని, త్వరలోనే వాటిని ఆన్లైన్లో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు జిల్లా కార్యదర్శులు ఏజాస్ అహ్మద్, గోపీనాథ్,సుబ్బారెడ్డి ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, రామకేశవ, నరసింహులు, బాబు చెన్నయ్య,మహబూబ్ బాషా,చింతల రాయుడు,నాగన్న తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఫోటోతో పాస్‌బుక్ పంపిణీ ఘనత సీఎందే

**తంబళ్లపల్లె ఫిబ్రవరి 3 ప్రభాతవార్త ః**



గత ప్రభుత్వం రైతుల భూముల పాస్ బుక్కులపై జగన్ ఫోటోతో పాస్ బుక్కులు ఇచ్చి సర్వే రాళ్లపై కూడా ఫోటోలు వేసుకొని రైతుల ఆగ్రహానికి గురయ్యారని కూటమి ప్రభుత్వంలో రైతు ఫోటోతో ఎలాంటి సమస్యలు లేని పాస్ బుక్కులు ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కినట్లు రాష్ట్ర టిడిపి బి.సి ఉపాధ్యక్షుడు కొండామర్రి తులసీదర్‌నాయుడు ప్రశంసించారు. మంగళవారం మర్రిమాకుల పల్లి సచివాలయంలో తాసిల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రైతులకు నూతన పట్టాదారు పాసుబుక్కులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో భూముల రీసర్వేలో జరిగిన పొరపాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిచేసి రైతులకు భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు లేకుండా పాస్ బుక్కులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం తాసిల్దార్ శ్రీనివాసులు,తులసీధర్ నాయుడు రైతులకు నూతన పట్టాదారు పాస్ బుక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, బిజెపి మండల మాజీ అధ్యక్షుడు రామస్వామి రెడ్డి, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డప్ప నాయుడు, జయచంద్ర నాయుడు,వీఆర్వో వెంకటేష్, సర్పంచ్ జ్యోతి,టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## అరెస్టు చేయాలి

**మదనపల్లె క్రైమ్ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త.**



గుండాలచే ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులపై దౌర్జన్యం చేసి కిడ్నాప్ చేయడం దుర్మార్గ చర్య అని ఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి నరసింహ అన్నారు. మంగళవారం నరసింహ విలేకరులతో మాట్లాడుతూ యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడానికి వెళుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్, ఎస్ఎఫ్ఐ ఎస్వీ యూనివర్సిటీ నాయకుడు వినోదులు కలెక్టర్ కార్యాలయం వద్ద ఉండగా దాడికి పాల్పడడమే కాకుండా, కిడ్నాప్ చేసి తీసుకెళ్లారన్నారు. యూనివర్సిటీలో గతంలో అనేక అక్రమాలు జరిగాయని, వాటిని వెలుగులోకి తీసుకొస్తున్న విద్యార్థి నేతలపై దాడులకు పాల్పడడం ఏ రకమైన సంస్కృతికి నిదర్శనమని అయన ప్రశ్నించారు. విద్యార్థి నాయకులకు అపాయం తలపెడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## సర్వే నెంబర్ తప్పిదాలను సరి చేయండి

**యర్రగుంట్ల ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**



తమ భూ సర్వే నెంబర్ల లో ఆన్లైన్ నందు ఇతరుల పేర్లు చూపిస్తున్నాయని ఆన్లైన్లో తప్పిదాలను సరి చేయాలని కోరుతూ యర్రగుంట్ల మండలం పరిధిలోగల నల్లబల్లె గ్రామానికి చెందిన రైతులు నారాయణ, తిమ్మయ్య, గంగాధర్, నాగేశ్వరరావు, కుళాయప్పలు మంగళవారం యర్రగుంట్ల తహసిల్దార్ శోభన్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ భూ సర్వే నెంబర్లలో ఆన్లైన్ నందు ఇతరుల పేర్లు చూపిస్తున్నాయని అందువల్ల అధికారులు తప్పిదాలను గుర్తించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై తహసిల్దార్ శోభన్ బాబు స్పందిస్తూ తప్పిదాలను సరిచేయాలని కార్యాలయంలోని సిబ్బందికి ఆదేశించారు.

## 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలి

**ఎన్‌టిఏ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరాజు**

**మదనపల్లె, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**



మాట్లాడుతున్న దృశ్యం

ప్రభుత్వం 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించి అమలు చేయాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాస రాజు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మదనపల్లె పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షులు నల్లమల రామాంజులు అధ్యక్షతన జరిగిన విద్యాసదస్సు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల విద్యాపై బడ్జెట్‌లో అధికశాతం నిధులు ఖర్చు చేస్తే వినూత్న కార్యక్రమాల ద్వారా పాఠశాలల అభివృద్ధికి విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని, ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చడానికి ఉపాధ్యాయుల అందరూ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. 2023నుంచి ఉద్యోగ ఉపాధ్యాయులకు నూతన పిఆర్‌సి అమలు చేయాల్సి ఉందని ఉద్యోగులు ప్రభుత్వంపై పెట్టుకొన్న ఆశలను వమ్ము చేయకుండా పిఆర్‌సి కమిషన్ నియమించి మధ్యంత భృతిని ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ అర్హతను రద్దు చేయాలని, బదిలీల చట్టం అనుసరించి పదోన్నతలకు, బదిలీలకు షెడ్యూల్ విడుదల చేయాలని, పంచాయితీరాజ్‌శాఖ లాగా విద్యాశాఖలో కూడా ప్రత్యేక క్యాడర్‌లను సృష్టించడం లేదా ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారానైనా కామన్ సర్వీస్ రూల్స్ ద్వారా విద్యాశాఖలో ఉన్న అన్ని క్యాడర్‌లకు పదోన్నతలు ఈ విద్యాసంవత్సరంలో జరిగేలా కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## జిల్లా ఎన్‌టిఏ ప్రధాన కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి

**మదనపల్లె, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**



విద్యా సదస్సు అనంతరం ఇటీవల జిల్లాల పునర్విభజనలో భాగంగా మదనపల్లె కేంద్రంగా అన్నమయ్య జిల్లా పునర్వ్యవస్థీకరణ అయిన దృష్ట్యా జిల్లా ప్రధాన కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షునిగా ఇస్మాయిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంకు అందుబాటులో ఉండి, ఉపాధ్యాయ సేవకు అంకితం అవుతమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఏ జిల్లా ఆర్థిక కార్యదర్శి కొండూరు మురళీమోహన్‌రాజు అసోసియేట్ అధ్యక్షులు కె.కులశేఖర్‌రెడ్డి, పఠాన్ మహమ్మద్‌ఖాన్, ఏ.షాజహాన్, ఇస్మాయిల్, అసదుల్లాషా, బి.రఫీఉల్లాఖాన్, కె.సలీంఖాన్, కళ్యాణి, భార్గవి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

**ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ**

**మదనపల్లె, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**

రాష్ట్రంలో విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్స్ న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత నాలుగు రోజులుగా విజయవాడలోని ధర్నాచౌక్‌లో ఆందోళన చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్‌కు మంగళవారం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏఐటియుసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సాంబశివ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని విద్యుత్ మీటర్ రీడంగ్ కార్మికులు రెడ్డెక్కారని తెలిపారు. స్మార్ట్ మీటర్లు కారణంగా తాము ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4వేల మంది స్మార్ట్ మీటర్స్ కారణంగా ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన చెందారు. మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కారం అయ్యేంతరకు ఉద్యమించాలని అధికారులు రీడర్స్ ఒత్తిడి తీసుకురాకుండా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా వర్కింగ్ అధ్యక్షులు సురేష్‌కుమార్, నియోజకవర్గ కార్యదర్శి ముభారక్, తిరుమల, గుంగులప్ప, ప్రశాంత్ గంగాదర్, హరిప్రసాద్, వాసుదేవరెడ్డి చంద్రశేఖర్, శ్రీనివాసులు, హరి నారాయణ, వినయ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివ

## ప్రాథమిక కార్యకర్తల సమావేశం

**బద్వేలు అర్బన్ ,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**



తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె. వినయ్ కుమార్ అధ్యక్షతన మంగళవారం ఆశా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు తమ కేటాయించిన గ్రామాల్లో మాతా-శిశు సంరక్షణ, అంటువ్యాధుల నివారణ, వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణీల సంరక్షణలో పోషకాహారం, రక్తహీనత నివారణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. వెంగయ్య మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ఆరోగ్య కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగి వాటిని ప్రజలకు చేరవేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 17వ తేదీన జరగనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ జనార్దన్ రావు కీటక జనిత వ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికి యూరియా అందిస్తాం: రవీంద్రారెడ్డి

**కాశినాయన ఫిబ్రవరి.03 ప్రభాతవార్త:**



మండలానికి రైతులకు కావాల్సినంత యూరియా అందుబాటులో ఉందని రైతులు అధైర్య పడవలసిన అవసరం లేదని బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రతి రైతు సేవా కేంద్రానికి యూరియా అందుతుందని ప్రతి ఒక్క రైతుకు సరిపడా యూరియా అందించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. కావున రైతులు అధైర్య పడవలసిన అవసరం లేదన్నారు. రంపాడు రైతు సేవ కేంద్రం వద్ద రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారనే విషయం మా దృష్టికి వచ్చిందన్నారు. రంపాడు రైతు సేవా కేంద్రం లో 350 బస్తాల యూరియా అందుబాటులో ఉందన్నారు. బుధవారం 350 బస్తాలు వస్తాయని తెలిపారు. మండలానికి కావాల్సిన అంత యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు అధైర్య పడవలసిన అవసరం లేదన్నారు .రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులు గట్టి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయనతోపాటు కాశినాయన మండల టిడిపి నాయకుడు పోలిరెడ్డి ఉన్నారు.

## టిడిపి సీనియర్ నాయకుడు మృతి

**ఒంటిమిట్ట ఫిబ్రవరి.03 (ప్రభాతవార్త )**

ఒంటిమిట్ట మండలం చిన్న కొత్తపల్లి గ్రామానికి చెందిన మండల తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు మామిడి .శ్రీనివాసులు(77) దాదాపుగా మంగళవారం మృతి చెందడం జరిగింది. గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఈరోజు ఆయన మృతి చెందడం జరిగిందని కుటుంబీకులు స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి మండలంలో ఒక ముఖ్య నాయకుడిగా ఉంటూ అహర్నిశలు పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ పార్టీకి గుర్తింపు తేవడం జరిగిందని అందరికీ చేదోడు వాదోడుగా ఉన్న శ్రీనివాసులు ఈరోజు భౌతికంగా లేకపోవడం చాలా దురదృష్టకరమని ఆ గ్రామ ప్రజలు పలువురు నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## కిడ్నాపర్లను కఠినంగా శిక్షించాలి

**సిపిఎం జిల్లా కమిటి డిమాండ్**

**మదనపల్లె, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**



తిరుపతిల విద్యార్థి సంఘ నాయకులను కిడ్నాప్ చేసిన కిడ్నాపర్లను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మదనపల్లెలో మంగళవారం స్థానిక విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని యూనివర్సిటి యాజమాన్యానికి చెందిన గూండాలు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు ధర్నాకు వెలుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.అక్బర్, ఎస్వీ. యూనివర్సిటి నాయకులు వినోద్‌కుమార్‌లపై దాడిచేసి కిడ్నాప్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇంతటి దురాగతానికి పాల్పడిన యూనివర్శిటిని బ్లాక్ లిస్టులో పెట్టాలని, విద్యార్థులకు యూనివర్శిటి చెల్లించాల్సిన కోట్లాది సొమ్మును తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనివర్శిటిలో జరుగుతున్న తప్పులు సరిదిద్దుకోవాలని చెబితే దాడి చేయడం హేతుబద్దంగా ఉందన్నారు. ఈ విషయంపై పోలీసులు,రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని విద్యార్థి సంఘం నాయకులపై దారుణానికి పాల్పడిన వారిపై కేసులు పెట్టాలన్నారు.

## కూటమిది విధ్వంస పాలన నడుస్తోంది

**వైసిపి సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్**

**మదనపల్లె, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**



సమావేశంలో మాట్లాడుతున్న నిస్సార్‌అహ్మద్

కూటమి ప్రభుత్వం విధ్వంస పాలనకు పాల్పడుతోందని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ తెలిపారు. మంగళవారం మదనపల్లె మండలం తట్టివారిపల్లెలో వైసిపి సంస్థాగత ఎన్నికల కార్యక్రమంలో నిస్సార్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రచ్చబండ రాష్ట్ర కో ఆర్డినేటర్ వజ్ర భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు అనూషరెడ్డి, మండల పరిశీలకులు మనూజాలు ముఖ్య అతిథిలుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తల మధ్య కమిటీ ఎన్నిక నిర్వహించారు. ప్రజాస్వామ్యబద్దంగా కమిటీలను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నిస్సార్‌అహ్మద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలన్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండుసంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు చేయకుండా వైసిపి వారిపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వజ్ర భాస్కర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, వీఎస్‌రెడ్డి, సర్పంచ్ దీప, వేమారెడ్డి, వెలుగు చంద్ర, వైస్ ఎంపిపి రమణ, మహేష్ కొత్తవారిపల్లె సోమశేఖర్‌రెడ్డి, నరసింహులు, మహేష్, కొత్తపల్లి, నూర్ మొహిద్దీన్‌ఖాన్, సాధిక్, నక్రుద్‌ఖాన్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పురుషుల కళాశాలలో శిక్షణా

**కడప ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**

ప్రభుత్వ పురుషుల కళాశాలలోని అన్ని సైన్స్ విభాగాల వారు డిబిటి స్టార్ కాలేజ్ స్కీంలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలలోని బోధనేతర సిబ్బంది సైన్స్ విద్యార్థులకు ప్రయోగశాల భద్రతా నియమాల గురించి మంగళవారం ఒక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. రవి కుమార్ మాట్లాడుతూ బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు భద్రతా నియమావళి పై అవగాహనను కలిగి ఉంటే ప్రయోగశాలలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయని తెలిపారు. కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రమణ రావు గారు భద్రతా నియమావళి ప్రాధాన్యత, ప్రయోగశాలలో ఎలాంటి వస్త్రధారణను కలిగి ఉండాలో డిబిటి కోఆర్డినేటర్ డాక్టర్ వై. సావిత్రి వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రసంగకర్తగా విచ్చేసిన పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శామ్యూల్ డేవిడ్ రాజ్ మాట్లాడుతూ ప్రయోగశాలలో రసాయనాలను ఎలా వినియోగించాలి, ఎలా భద్రపరచాలి రసాయనాలు ఒలికిపోయినప్పుడు ఎలా శుభ్రపరచాలి, వేస్టేజ్ ని ఎలా డిస్పోస్ చేయాలి అన్న విషయాలపై చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బి. రవిశేఖర్, డాక్టర్ పి. బయపురెడ్డి, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ కల్పన, వై.అనిత, డాక్టర్ వీర నాగేంద్ర కుమార్, డాక్టర్ బి. రామచంద్ర డాక్టర్, బి. మహేష్, డాక్టర్ సి.నాగేశ్వరరెడ్డి, శ్రీమతి సిహెచ్. అనిత, శివరామకృష్ణ, ఇతర బోధన, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి



**రాయచోటి టౌన్ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

రాయచోటిలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. రాయచోటి పురపాలకలో చెత్త సేకరణకు మంజూరైన ఆరు ఆటోలను పూజలు నిర్వహించి,జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్మూలనకు అధికారులు కృషి చేయాలన్నారు, రాయచోటిని పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయడం జరుగుతుందని,ఆయన తెలిపారు రాష్ట్రంలోని రాయచోటిని ఆదర్శ పురపాలకగా తీర్చిదిద్దేందుకు అధికారులు కూటమి నాయకులు అంతా కలిసి కృషి చేయాలని ఆయన తెలిపారు. ప్రతి వార్డులో ప్రతి గడపకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను తెలియజేసి, అర్హులందరికీ అందజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రానున్న ఎన్నికలలోపు ప్రతి వార్డులో త్రాగునీరు,రహదారులు,విద్యుత్తు వంటి సమస్యలు 100!! పరిష్కారం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

## చదువుపైనే దృష్టి పెట్టాలి



**వేంపల్లె:ఫిబ్రవరి 03(ప్రభాత వార్త)**

విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా దృష్టి అంతా చదువుపైనే పెట్టి భవిష్యత్తును బంగారు బాట వేసుకోవాలని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ తలిశెట్టి సుబ్రహ్మణ్యం ప్రభుత్వ బాలుర, తలిశెట్టి శేషమ్మ బాలికల పాఠశాలల్లో 55వ వార్షోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల్లో స్థల దాతలైన కుటుంబ సభ్యులకు పాఠశాల తరుపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి మాట్లాడుతూ ప్రతి నిమిషం చాలా విలువైనదని కాబట్టి విలువైన సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంత ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికి తల్లిదండ్రుల తర్వాత గురువులకు కూడ గౌరవించడం అనేది మరవరాదని చెప్పారు. అనంతరం ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు నర్రెడ్డి సంగమేశ్వర రెడ్డి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థికి చదువు చెప్పే గురువులే భయపడుతున్నారని చెప్పారు. అరచేతిలో సెల్ ఫోన్ వచ్చిన తర్వాత పరిస్థితులు మారి పోయినట్లు చెప్పారు. అనంతరం ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన, క్రీడాల్లో, చదువులో రాణించిన విద్యార్థులను నగదు బహుమతులను దాతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ నరసింహారెడ్డి, పాఠశాల హెచ్ఎంలు శ్రీనువాసులు రెడ్డి, నాగాంజనేయులు, రాజశేఖర్, ధర్మారెడ్డి, స్థల దాత కుటుంబ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే



రైతులకు పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమంటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం మదనపల్లె రూరల్ మండలం తట్టివారిపల్లె సచివాలయంలో జరిగిన గ్రామసభలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులలో భరోసా కల్పించేందుకు తమ వ్యవసాయ పొలంకు చెందిన పాస్‌పుస్తకాలపై రాజముద్రతో రైతులకు అందించడం సంతోషదగ్గ విషయమని అన్నారు. పాసుపుస్తకాలలో ఏమైనా పొరపాట్లు ఉంటే ఇక్కడ నిర్వహించే డెస్క్ వద్ద సరిచేసుకోవచ్చునని సూచించారు. వ్యవసాయ సాగుకు సంబంధించి రైతులకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా ప్రభుత్వం సబ్సిడీ రూరంలో అందిస్తుందన్నారు. రైతులకు రబీ, ఖరీఫ్ సీజన్‌లకు సంబంధించి ఆధునిక వ్యవసాయ సాగుకాను వ్యవసాయ అధికారులచే అవగాహన దస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. భూ యజమానులు ఉన్న ఫోటోతోనే పాస్‌పుస్తకాలు ఇవ్వడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలు వల్లే రైతులకు అనేక ఇబ్బందులు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దీపా వేమారెడ్డి, జయరామ్ యాదవ్, శామీర్, ఖాసీం, ఎంపిడిఓ తాజ్‌మసూర్, మాజీ సర్పంచ్ వేమనారాయణరెడ్డి, పెద్దసంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాల కార్మికుల్ని పనిలో పెట్టుకోవడం నేరం

**యర్రగుంట్ల ఫిబ్రవరి3 ప్రభాతవార్త:**



బాల కార్మికుల్ని పనిలో ఉంచడం చట్టరీత్యా నేరం అని 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోరాదని కడప సర్కిల్ 3 లేబర్ ఆఫీసర్ అల్లాబకష్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పావని తెలిపారు. నాలుగు రోడ్ల కూడలిలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పాన్ ఇండియా ప్రచార కార్యక్రమం లో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. మార్చి 31 వరకు తనిఖీలు కొనసాగుతాయి అన్నారు. స్థానిక కడప రోడ్డులో, ప్రొద్దుటూరు రోడ్డులో గల ఫ్లైఓవర్ బ్రిడ్జి క్రింద హోటలలో, జనరల్ స్టోర్లలో, ఆటోమొబైల్ షాపులలో తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా యజమానులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. బాల కార్మికులు ఎక్కడైనా కనిపిస్తే చైల్డ్ లైన్ 1098కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాలకార్మిక, బాల్య వివాహాల నివారణ కోసం ఈ కార్యక్రమం జరుగుతోందని వివరించారు. అలాగే సంబంధిత స్టిక్కర్లను, పోస్టర్స్ ను తగిలించమని యజమానులకు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ షబీరున్, రెడ్స్ ఎన్జీవో వాణి పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు వన్‌టౌన్ సీఐగా కొండారెడ్డి

**ప్రొద్దుటూరు క్రైం, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**



ప్రొద్దుటూరు వన్‌టౌన్ సీఐగా కేవీ కొండారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ శ్రీరామ్‌ను అధికారులు బదిలీ చేసిన విషయం తెలిసిందే. అన్నమయ్య జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సీఐ టీవీ కొండారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను అణచివేస్తూ సామాన్య ప్రజలకు భద్రత కల్పిస్తానని అలాగే రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## కొంగా సుబ్బారెడ్డికి డాక్టరేట్

**సిద్ధవటం ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**



మల్లారెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ కళాశాల అధ్యాపకుడు సిద్దవటం మండలం వంతాటిపల్లె కు చెందిన కొంగా సుబ్బారెడ్డి కి జవహర్ లాల్ టెక్నిలాజికల్ యూనివర్సిటీ అనంతపూర్, అనంతపురము ఏం.బి.ఏ విభాగం డాక్టరేట్ ను ప్రదానం చేశారు. ప్రొఫెసర్ టి. నారాయణ రెడ్డి పర్యవేక్షణలో ఇంపాక్ట్ అఫ్ సోసియల్ మీడియా ఆన్ బ్రాండ్ ఇమేజ్ అఫ్ ఆన్లైన్ స్టోర్స్ ఏ స్టడీ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధన చేసి గ్రంధాన్ని సమర్పించారు. దీంతో జె.ఎన్ టి.యు.ఏ ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారులు కొంగా సుబ్బారెడ్డి కు పీ.హెచ్.డి పట్టాను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను మల్లారెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ కళాశాల చైర్మన్ మల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస శాస్త్రి, విభాగాదిపతి ఫిరోజ్ అహ్మద్ తో పాటు పలువురు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

## వికసిత భారత్ లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు



**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

భారతదేశ తాత్కాలిక ప్రయోజనాలకు కాకుండా దీర్ఘకాలంలో దేశ పురోగతికి తోడ్పాటు అందించే దిశగా ప్రపంచంలో భారత్ ను విశ్వ గురువుగా నిలబెట్టేందుకు వికసిద్భారత్2047 లక్ష్యంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారాం ప్రవేశపెట్టిన తాజా కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు జంగింటి వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బొల్లవరంలోని గోల్డెన్ పార్కులో నిర్వహించిన బిజెపి నియోజకవర్గ సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అభివృద్ధి పథంలో దేశాన్ని వేగంగా పరుగులు తీయించాలన్న సంకల్పంతో మోడీ సర్కార్ బృహత్తర ప్రణాళికతో రూపొందించిన బడ్జెట్ దీర్ఘకాలిక వృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. 2047 నాటికి భారత్ ను ప్రపంచంలో విశ్వరూపుగా నిలిపేందుకు ఇలాంటి బడ్జెట్ లు దోహదపడతాయన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ రానున్న మునిసిపల్ ఎన్నికలు అంకెల గారడి కాదని నీతికి నిజాయితీకి అభివృద్ధికి ప్రజలు పట్టం కడతారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్ గౌరీ శంకర్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గురుకుమార్ రాజుపాలెం మండలాధ్యక్షుడు ముల్లా అస్మద్ ప్రొద్దుటూరు రూరల్ అధ్యక్షుడు గోపిరెడ్డి మురళీకృష్ణ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ నాయుడు బిజెపి నాయకులు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తుందిలో వ్యవసాయ అధికారులు



**మైదుకూరు, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త:**

మండలంలోని నంద్యాలంపేట పరిధిలోని పెద్దశెట్టిపల్లి మరియు లోకాయపల్లి గ్రామాలలో రబీ పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఇ.బాల గంగాధర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైదుకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. కృష్ణమూర్తి హాజరుకావడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏడిఏ మాట్లాడుతూ గ్రామాల్లో సాగు చేసిన మినుము, మొక్కజొన్న, నూగు పంటల స్థితిగతుల గురించి, పంటలో వచ్చే సమస్యల గురించి రైతులతో చర్చించడం జరిగింది. అలాగే ప్రభుత్వం ద్వారా వచ్చే అన్నదాత సుఖీభవ మరియు పీఎం కిసాన్ పథకాల గురించి అర్హులు మరియు అనర్హులు ఎలా అవుతారు అనే దాని గురించి రైతులకు వివరించడం జరిగింది. పంట చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం ద్వారా సున్నా వడ్డీ పంట రుణాలు, పంట నష్ట పరిహారం, క్రాప్ ఇన్సూరెన్స్, కనీసం మద్దతు ధర, ప్రభుత్వం ద్వారా పంట కొనుగోలుకు మొదలగు వాటికి అవకాశం ఉంటుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సెరికల్చర్ అధికారి గుర్రప్ప మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు గురించి పట్టుపురుగుల పెంపకం ద్వారా కలిగే ఉపయోగాలు గురించి రైతులకు క్లుప్తంగా వివరించడం జరిగింది. అనంతరం ఏవో ఆధ్వర్యంలో పంట పొలాలను సందర్శించి వాటిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమములో మైదుకూరు మండల వ్యవసాయ అధికారి ఇ.బాల గంగాధర్ రెడ్డి, సెరికల్చర్ అధికారి గుర్రప్ప, వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## క్యాట్ లెవెల్2లో విద్యార్థుల విజయకేతనం



**బద్వేలు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త**

స్థానిక గాండ్ల వీధి లోని శ్రీ చైతన్య పాఠశాలలో సిబ్యాచ్ విద్యార్థులు క్యాట్ ఒలంపియాడ్ పరీక్షలో ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ఏ.జి.యం రమణయ్య మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో క్యాట్ లెవెల్2లో 40 మంది విద్యార్థులు విజయం సాధించారని, అందులో 6 మంది 6 వేల రూపాయల నగదు బహుమతి,13 మంది పథకాలు, 21 మంది ప్రసంశ పత్రాలు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఖధీరుల్లా , డీన్ నాగ సుబ్బరాయుడు, సిఇంచార్జ్ మణికంఠ ,ప్రైమరీ ఇంచార్జ్ షబీనా, ఉపాధ్యాయ బృందం పాల్గొని ఇంతటి విజయానికి కారణమైన తల్లిదండ్రులను, విద్యార్థులను అభినందిస్తూ, హర్షం వ్యక్తం చేశారు.

## కొత్త హరిజనవాడలో రక్షిత మంచినీటి బోరు

**కలికిరి, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**

మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ కొత్తహరజనవాడలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ పంచాయతీ కార్యదర్శి వి.గంగాదేవీలు పూజా కార్యక్రమాలు చేపట్టి బోరు డ్రిల్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలో ఉన్న రక్షిత మంచినీటి బోరులో మంచినీరు అడుగంటి గ్రామంలో సమస్య ఏర్పడింది. ఈ సమస్యను గ్రామస్థులు సర్పంచ్ దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ సమస్యను సర్పంచ్ రెడ్డిరామ్ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి గ్రామంలో కొత్త బోరు వేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం గ్రామంలో కొత్త బోరు వేయడంతో బోరులో పుష్కలంగా నీరు పడ్డాయి. గ్రామాన్ని మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి సందర్శించారు. గ్రామంలో కొత్త బోరు వేయడం బోరులో పుష్కలంగా నీరు పడడంతో గ్రామస్థులు స్థానిక సర్పంచ్ రెడ్డిరామ్, పంచాయతీ కార్యదర్శి గంగాదేవీ ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.



## పద్యనాటక పోటీలలో శివ, లీలలు నాటకం ఎంపిక

**రాజుపాళెం, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త:**

రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి పద్య నాటక పోటీలలో ప్రొద్దుటూరు వారు ప్రదర్శించిన శివ లీలలు అనే నాటకం ప్రాథమిక పరిశీలనకు ఎంపికైనట్లు నాటక నిర్వాహకులు, ఉపాధ్యాయులు కేతు చంద్రశేఖర్ యాదవ్ తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి పద్య నాటక పోటీలు మిర్యాలగూడలో ఇటీవల నిర్వహించడం అయినది. పోటీ ప్రదర్శనలు నిర్వహించిన నాటకాలలో ప్రొద్దుటూరుకు చెందిన శ్రీ వెంకట సాయి వెలుగు కళాకారుల సమాజం వారు ప్రదర్శించిన శివ లీలలు పద్య నాటకం గుర్తింపు పొంది ప్రాథమిక పరిశీలనకు ఎంపికైనట్లు ఆ నాటకంలో ప్రదర్శించిన కళాకారులందరినీ అభినందిస్తూ నాటక నిర్వాహకులు చంద్రశేఖర్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు.

## అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### సింగల్ విండో చైర్మన్ గుత్తికొండ త్యాగరాజు



**మొలకలచెరువు ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

మండలం అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలని సోంపల్లి సింగల్ విండో చైర్మన్ గుత్తికొండ త్యాగరాజు అన్నారు. మంగళవారం ములకలచెరువు ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపీపీ సాయిలీల అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా అధికారులు ప్రగతి నివేదికను సభలో తెలియజేశారు. అనంతరం ఎంపీడీవో హరి నారాయణ మాట్లాడుతూ అధికారులు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలన్నారు. చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలోన చేపట్టే విధంగా దృష్టి సారించాలన్నారు. అనంతరం త్యాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అహర్నిశలు ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ మండల అభివృద్ధికి అధికారులు దృష్టి సారించాలని, బస్టాప్ లలో పల్లె వెలుగు ఇతర సర్వీస్ బస్సులు ఆపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి మోహన్ రెడ్డి, డిటి లక్ష్మి, సర్పంచులు విష్ణువర్ధన్ రెడ్డి, జయచంద్ర కుమార్, చిన్న మేకల వెంకటరమణారెడ్డి, ఎంపీటీసిలు అయిషా చాంద్ భాషా, అధికారులు పాల్గొన్నారు.

## కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెల్లాలి



**సదుం ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో సదుం మండలం యర్రాతివారిపల్లెలో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పార్టీప్టతకు క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేస్తున్న గ్రామ కమిటీలు ఎంతో కీలకమైనవన్నారు. ఈ కమిటీలు రానున్న ఎన్నికల్లో ఎంతో కీలక కానున్నాయని చెప్పారు. అదేవిధంగా తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ అన్యాయం జరిగితే ఎక్కడైనా ఎప్పుడైనా నిలదీస్తామన్నారు. ప్రతి ఒక్కరు గ్రామాల నుంచి వైసిపి అభివృద్ధికి కృషి చేయాలి అన్నారు. సమావేశ ప్రారంభంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ నెల 5న జరగనున్న చలో పోతిరెడ్డిపాడు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని దుష్ప్రచారం చేసి ప్రజల మనోభావాలను దెబ్బతీసిన కూటమి నేతలు క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేస్తూ పోస్టర్లను విడుదల చేశారు. గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ,గ్రామ కమిటీల ప్రాధాన్యతను వివరించారు. చంద్రబాబు నాయుడుకు భక్తికన్నా రాజకీయాలే ముఖ్యమని, ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా పార్టీ అధ్యక్షుడు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమ్మనాథరెడ్డి, చిత్తూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, చిత్తూర్ మాజీ ఎంపీ ఎం రెడ్డప్ప, నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ,రాష్ట్ర కార్యదర్శి వజ్ర భాస్కర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి పోత్తా శివశంకర్ రెడ్డి, పుంగనూరు నియోజకవర్గ నాయకులు అనూష రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి, టిటిడి బోర్డు మాజీ సభ్యుడు అశోక్ కుమార్, జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీలు పుట్రాజ్, ధనంజయ రెడ్డి, వల్లివేడు రాజారెడ్డి, నియోజకవర్గంలోని అన్ని మండలాల వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బలవర్ధకమైన ఆహారంతోనే ఆరోగ్యం



**కలసపాడు, జనవరి 3 ప్రభాతవార్త:**

మంచి పోషకమైన బలవర్ధకమైన ఆహారంతోనే తల్లి, బిడ్డ అందరూ ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి శైలజ పేర్కొన్నారు. మంగళవారం ఆశ డే సందర్భంగా కలస పాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మాట్లాడుతూ ఆశ డే లో ప్రాధాన్యతలు ఫుడ్ పోర్టిఫికేషన్, ప్రధాన సూక్ష్మ పోషకాలు గురించి సిబ్బందికి అవగాహన కల్పించమని, ముఖ్యంగా మనం నిత్యంతేసుకొనే బియ్యం, గోధుమలు,పాలు,అయోడిన్ ఉప్పు,గుడ్డు తోపాటు అవసరమైన విటమిన్లు ఖనిజాలు అనగా విటమిన్ ఎ, బి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి వెంకట సుబ్బమ్మ, హెల్త్ అసిస్టెంట్‌లు రామతీర్థం, జయ రామిరెడ్డి, ఎంఎల్‌హెచ్ లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికాలు జన బాట కార్యక్రమం

**సుండుపల్లె, పిబ్రవరి 03,ప్రభాతవార్త :**

మండల పరిధిలోని జన బాటలో భాగంగా గుండ్లపల్లి గ్రామాన్ని పర్యటించారు ఈసందర్భంగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంబాలు, ట్రాన్స్ఫార్మర్లు పరిశీలించి వాటి వివరాలను ఎపిఎస్‌పిడిసిఎల్ యాప్‌లో నమోదు చేసారు. దీంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉపకేంద్రాల చరవాణి నంబర్లు మార్పు చేసినట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ రమేష్ బాబు తెలిపారు. మునుపటి బిఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్ సరిగా పని చేయకపోవడంతో ఎయిర్టెల్ నెట్‌వర్క్‌కు మార్పు చేయడం జరిగినదని తెలియజేశారు. విద్యుత్ ఉపకేంద్రాల కొత్త మొబైల్ నంబర్లు: సుండుపల్లె - 8712460442 రాయవరం - 8712460447 మడితాడు - 8712460446 జి.రెడ్డి వారిపల్లి - 8712460448 ముద్నుపాడు - 8712460449 పూజారివాండ్ల పల్లి - 8712460443, సానిపాయి - 8712460445 వినియోగదారులు అవసరాల కోసం సంప్రదించవలసిందిగా కోరడమైనది.



## బైపాస్ రోడ్లను నిర్మించాలి



**దువ్వూరు, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరులోని ప్రొద్దుటూరు పోయే రహదారిలో వాహనాలు పెరిగిపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని అందువల్ల దువ్వూరుకు బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరుతూ బిజెపి నాయకులు మంగళవారం స్థానిక తహసిల్దార్ సంజీవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రమైన దువ్వూరు నుండి పొద్దుటూరుకు పోయే రహదారిలో ఎక్కువ వాహనాలు వెళ్లడంతో తరచు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. వీటి నివారణకు గాను ప్రొద్దుటూరు రోడ్డు నుండి బైపాస్ రోడ్డును ఆంజనేయ స్వామి దేవాలయం వరకు నిర్మిస్తే దువ్వూరులో ట్రాఫిక్ రద్ది తగ్గి ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. అలాగే దువ్వూరు పొద్దుటూరు రోడ్డులో ఉన్న వాసుదేవపురం రోడ్డును కూడా డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలన్నారు. ఈ రెండు రోడ్లకు తక్కువ ఖర్చు అవుతుందని దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. ఈ రెండు రోడ్ల నిర్మాణం పూర్తి అయితే గుడిపాడుకు ఇటు దువ్వూరులో ట్రాఫిక్ సమస్యలు తొలగిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర సభ్యుడు ఆరవేటి హరికృష్ణ, చెన్నకేశవరెడ్డి, రంగనాథ్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు సంక్షేమానికి పెద్దపీట

### - పోలీసు అధికారుల సంఘం రాష్ట్రష డైరీ ఆవిష్కరణలో జిల్లా ఎస్పీ



**కడప క్రైం, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**

జిల్లాలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలకు ఎటువంటి ఆపది కలిగినా తాను అండగా ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తాని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఏపీ పోలీసు అధికారుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర పోలలీసు డైరీ-2026ను ఆవిష్కరించారు. ఈ నూతన సంవత్సరంలో సబ్బంది రెట్టింపు ఉత్సాహంతో విధులు నిర్వర్తించి ప్రజలకు విలువైన, నాణ్యమైన సేవలు అందంచడం ద్వారా పోలీసు శాఖకు మంచపేరు తీసుకురావాలన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రకాష్‌బాబు, జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆర్ఐ సోమశేఖర్ నాయక్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, స్టేట్ కోఆప్షన్ మెంబర్ షఫీవుల్లా, ఈసీ మెంబర్లు మాధవీలత, ఏప్రిన్, సభ్యులు రామస్వామి రాజు పాల్గొన్నారు.

## ప్రజల భద్రతకు విజిబుల్ పోలీసింగ్



**కడప క్రైం, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**

ప్రజల ప్రాణాలు, స్తుల రక్షణతో పాటు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కల్పించడమే కాకుండా మోటారు వాహనాల చట్టం ప్రకారం నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ప్రజలకు వాహనదారులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తూనే హెల్మెట్ ధరించాలని కారు డ్రైవర్లు సీటు బెల్టు పెట్టుకోవాలని స్పష్టం చేస్తున్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. అలాగే ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రోడ్డు భద్రతా ఉల్లంఘనదారులపై ఎంవీ చట్టం ప్రకారం చర్యలు తీసుకున్నారు. పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా, పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా విజిబుల్ పోలీసింగ్ కొనసాగిస్తున్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం వంటి నిబంధనల ఉల్లంఘటనల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు గంజాయి మరియు ఇతర అనుమానిత వస్తువుల రవాణా జరగకుండా నిరంతర వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. భద్రతకు సంబంధించి ఏమైనా సమస్యలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనంచిన వెంటనే సమీప పీఎస్‌కు కానీ లేదా డయల్ 112కు కానీ సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర ప్రయోజనాలే పరమావధి

**పులివెందుల, ఫిబ్రవరి 3, ప్రభాత వార్త :**



రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న రాజకీయ అనుచిత వ్యాఖ్యలపై టీడీపీ నేత మాజీ పట్టణ అధ్యక్షులు మద్దూరు వెంకట్రామిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా ప్రతి రాజకీయ పార్టీ వ్యవహరించాలని, రెచ్చగొట్టే వ్యాఖ్యలతో శాంతిభద్రతలకు భంగం కలిగించకూడదని ఆయన హితవు పలికారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని తన స్వగృహం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనవసర రాజకీయ ఉద్రిక్తతలు తలెత్తకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ద్వారా అన్ని స్థాయిల నాయకులకు స్పష్టమైన సంకేతం పంపించామని తెలిపారు. అవతలివారు రెచ్చగొట్టేందుకు ప్రయత్నించినా, మనవాళ్లు రెచ్చిపోకుండా సంయమనం పాటించాలని ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలంటే శాంతిభద్రతలు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ముఖ్యంగా వైసీపీకి చెందిన మాజీ మంత్రులు పేర్ని నాని, జోగి రమేష్, అంబటి రాంబాబుల వ్యాఖ్యలు రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు చేసిన కుట్రగా ఆయన అభివర్ణించారు. కమ్మ, రెడ్డి సామాజిక వర్గాలకు చెందిన కొంతమంది నేతలు మౌనంగా తమ పని తాము చేసుకుంటుంటే, కేవలం కొన్ని సామాజిక వర్గాలను ముందుకు తెచ్చి రాజకీయంగా ఉద్రిక్తతలు పెంచాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా వెళ్తుంటే, ఇలాంటి వ్యాఖ్యల వల్ల ప్రజల్లో ప్రతికూల అభిప్రాయం ఏర్పడుతోంది" అన్నారు. కొడాలి నాని, వల్లభనేని వంశీ వంటి నేతలు కూడా ప్రస్తుతం సైలెంట్‌గా ఉన్నారని, ఎన్నికలకు ఆరు నెలల ముందు రాజకీయాలు చేస్తే సరిపోతుందని, ఇప్పుడిది పద్ధతి కాదని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో దాడులు సమర్థనీయం కాదని స్పష్టం చేసిన ఆయన, సజ్జల రామకృష్ణారెడ్డి 'రిటర్న్ గిఫ్ట్' వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.